**కథ** దానం శివప్రసాదరావు

# ఇదిగో లంచ్ బాక్స్

## (సావిత్రమ్మకు తప్పలేదు)

**"కర్మల నాచరించుటయందే నీవు ఆసక్తుడివై ఉండాలి. వాటి ఫలితాల యందు కాదు. ధర్మాచరణతో కూడిన కర్మాచరణ శ్రేష్టమైంది. మానవజీవితం కర్మలతో ముడివడి ఉంది. కర్మల నుండి విడివడిన శరీరం శవంతో సమానమైంది. కర్మయోగిగా మసలుతూ నీ జీవితాన్ని పండించుకో. ఇదే జీవన పరమార్థం"**

స్వామివారి అనుగ్రహభాషణం గంగా ప్రవాహంలా సాగుతోంది. అసంఖ్యాక భక్త జనసందోహం మంత్రముగ్ధులై వింటున్నారు.

మెగాసిటీకి ముప్పై ఐదు కిలోమటర్ల దూరంలో స్వామి ఆత్మానంద ఆశ్రమంలో విశాలమైన ప్రకృతి ఒడిలో, వేదికపై నుండి వచ్చే అనుగ్రహభాషణం గుండెలను సూటిగా తట్టి ఆలోచింపచేసేదిలా ఉంది.

గంటలు నిముషాల్లా గడిచిపోయాయ్. ఎటువారటు. అగ్గిపెట్టెల్లా బారులు తీరి ఉన్న కార్లలో కదలిక. ప్రవాహంలా జనవాహిని రోడ్డుమీదకు వచ్చేసింది. టూవీలర్స్ ఓ ఇరవై నిముషాల వరకు అవిశ్రాంతంగా తోకచుక్కల్లా 'రయ్'మంటూ ఇట్టే మెరుపువేగంతో కదిలిపోయాయ్.

"సారథి కారు తీస్కొస్తే సరిపోయేది కదా! ఈ టైంలో సిటీబస్‌లే ముంటాయ్ అయినా, వాడు తీస్కెమన్నాడు కదా! మీది మరీ చాదస్తం కాకపోతేనూ" దీర్ఘం తీస్తూ అంది సావిత్రమ్మ.

"సర్వీస్ ఆటోలుంటాయ్! ఏవేళైనా నీకేం ఇబ్బంది లేదు. ఇదేం మాచర్ల అనుకున్నావా? బెంగుళూరు సిటీ. అదుగో పద!" అంటూ ఆటోను కేకేశాడు ఉమాసుతరావు.

భార్య దారెంట ఏవేవో విషయాలు చెప్తున్నా వింటున్నట్టుగా తలూపుతునే ఉన్నా కర్మసిద్ధాంతమే మెదడులో గింగిర్లు తిరుగుతోంది.

'కర్మాచరణే నీ విధి. ఫలితాలను నాకొదిలెయ్'

మరి ఫలితం ఇవ్వని కర్మలను ఆచరించి పొందే ఫలం ఏమిటి? రైతు పంటను పండించే దెందుకు? అహోరాత్రులు శ్రమించి స్వేదం చిందించే దెందుకు? అంతెందుకు ఇంట్లో పూల మొక్కలను సైతం శ్రద్ధగా పెంచేదెందుకు?

ఫలితాల నాశించకుండా ఎవ్వరూ ఏ పనీ చెయ్యరు కదా!

"కాదు. కర్మల నాచరించడం నీ ధర్మం ఫలితాలపై వ్యామోహం పెంచుకోకు అదే నిన్ను వలలో బంధిస్తుంది. చేపలా గిలగిల్లాడతావు"

"లోకధర్మం ఇదే కదా!" ఈ ఆలోచనలో తప్పేముంది?

అక్కడే అజ్ఞానంలో పడ్తున్నావ్!

అంటే మనం పెంచిపోషించిన వృక్షం నీడను కోరుకోవడం తప్పా!

పిచ్చివాడా అని ఎవరన్నారు? నీడనివ్వడం ఆ చెట్టు ధర్మం. సృష్టిలో కన్పించే ప్రతివస్తువుకు, జీవరాశికి ఓ ధర్మం ఉంది. అదే కర్మాచరణ.

ఏమిటో ఈ వేదాంతం? ఏదీ సరిగ్గా బోధపడే తా ఉండదు.

రాత్రి పన్నెండున్నరైంది.

"ఏమిటా పరధ్యానం! దిగండి" అన్న సావిత్రమ్మ హుకుంతో ఆటో దిగి ఈ లోకంలోకి వచ్చాడు ఉమాసుతరావు.

కోడలు, పిల్లలు నిద్రలో ఉంటారు బాగా.

లిఫ్ట్‌నుండి తమ ఫ్లోర్‌లోకి వెళ్ళారు. అప్పుడు భోజనం తాను చేయనని ఓ గ్లాసెడు మజ్జిగ త్రాగి గదిలోకి వెళ్ళాడు. పడుకోగానే సావిత్రమ్మకు నిద్ర ముంచుకొచ్చేసింది.

ఉమాసుతరావుది ఆరోగ్యవంతమైన శరీరమే ఐనా ఒక్కపట్టాన నిద్ర ఎంతకూ పట్టడం లేదు. లేచి గ్లాస్ విండో దగ్గరికి వచ్చేశాడు. స్వామివారి కర్మసిద్ధాంత ప్రవచనాలు చెవుల్లో తారాడుతున్నాయి. ఫిఫ్త్‌ఫ్లోర్‌లో కొడుకు సారథి ఫ్లాట్ గదిలో చీకటి జీరోబల్బ్ వెల్గుతోంది. గ్లాస్ విండోలోంచి చూస్తుంటే బెంగుళూరు సిటీ పాదరసం లైట్ల వెలుగుల్లో మెరిసిపోతోంది.

మాకు పగలైనా రేయైనా ఒకటేనంటూ ఆకాశంలో క్షణానికో ఎయిర్‌ఫ్లైట్ విన్యాసాలు. ఈజీ ఛైర్‌లో రెండు చేతులూ మెడ, తలక్రిందకు పెట్టుకొని మెరిసే లైట్ల కాంతులను, ఆకాశహర్మ్యాలను చూడసాగాడు.

నిద్రరానప్పుడు 'నీకు మేము తోడు' అన్నట్లుగా ఆలోచన్లు ముసురుకుంటూ గతాన్ని కెలుకుతున్నాయ్.

★ ★ ★

"హమ్మయ్య ఇక రేపట్నుంచి మీకు లంచ్ బాక్స్ రెడీ చేయడం హడావిడిగా పరుగులు తీయడం ఇక తప్పింది" నవ్వుతూ అంది సావిత్రి.

అవునుమరి! ఒకటా రెండా..దాదాపు 30 సంవత్సరాల నుంచీ హడావిడిపడ్తూనే ఉంది. 58 సంవత్సరాలు నిండిన కారణంగా ఆర్టీసీ వారు ఆ రోజు ఘనంగా సన్మానించి ఇంటికి పంపారు.

ఎవరికైనా తప్పదుగా రిటైర్‌మెంటు.

కానీ రిటైర్‌మెంట్ మరునటిరోజునుంచీ ఎవరినోటైనా ఒకటే మాట! ఖాళీయేగా! హాపీగా గడుపుతున్నావ్? ఓసారి అలా వచ్చిపోకూడదూ? అని ఒకరంటే

సావిత్రి సైతం అనేది "ఏమిటట ఆ తొందర! బైటికెళ్ళి ఏం చెయ్యాల్ట? ఇప్పుడంతా తీరికేకదా! ఓసారి అబ్బాయి దగ్గరకు వెళ్ళొద్దాం పదండి! చాలాకాలమైంది చూసి!"

అప్పుడప్పుతను డిపో దగ్గరకు వెళితే-

"నీకేం మహానుభావా! ఒడ్డున పడ్డావ్- ఎన్ని మాటలైనా చెప్తావ్? ఇప్పుడిక టౌనంతా నీదే. కావల్సినంత కాలక్షేపం!"

"అవునయ్యా! ఇన్నాళ్ళూ డ్యూటీలంటూ తిరిగావు. ఇప్పుడెలా పొద్దుపోతోంది? ఏదోక వ్యాపకం కల్పించుకోవోయ్"

రకరకాల వ్యాఖ్యానాలు సలహాలు?

ఏదో రిటైరైన తర్వాత ఇక తన పనైపోయినట్టుగా, ఊడగొట్టిన నాగలి కర్రుముక్కలా పక్కకు పడి ఉన్నట్లుగా సంబోధనలు!

"ఇదుగో మన కరెంటు బిల్లుతో పాటు, శాస్త్రిగారి బిల్లు కూడా కట్టిరండి! పాపం ఆయనకు జ్వరమట. వనజమ్మగారు వచ్చి వెళ్ళారు"

నిన్నటికి నేటికి ఎంత తేడా!

ఆర్టీసీ డ్రైవరుగా పనిచేసిన ఇంతకాలంలో కొడుకును బాగా చదివించుకోవడం- ఓ చిన్న ఇల్లును కట్టుకోవడం మినహా వెనకేసిందేమీ లేదు.

బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా స్థిరపడ్డ సారథి- ఇన్నాళ్ళూ కష్టపడ్డావ్. ఇక మీరు నా దగ్గరకు వచ్చేయండి పట్టుపట్టడంతో ఇల్లు అద్దెకిచ్చేసి బెంగుళూర్‌కు రాక తప్పలేదు.

ఇంటిని కూడా అమ్మేయండి అన్నాడు సారథి. కానీ మమకారం అమ్మేయనీయలేదు. నేటికి సరిగ్గా సంవత్సరమైంది తాను రిటైరయ్యి.

మొదటి ఆర్నెలలు ఆ సిటీ కల్చరుకు అలవాటు

పడటం బాగా కష్టమనిపించింది. రావల్సిన బకాయిలు, పెన్షన్ ఫిక్సేషన్లకని అటూ, ఇటు తిరగడంతో కాస్తంత కాలక్షేపం బాగానే ఉంది కానీ- ఇక ఈ ఆర్నెల్ల కాలం తనను స్థబ్దుణ్ణే చేసింది.

ఈమధ్య రెండు మూడు నెలల కాలంలోనే కాస్త మార్పు..ఫ్లాట్ జీవితం, టీవీ ప్రోగ్రాములు వదలి బైటకు రావడం కాస్తంత!

కొడుకు కోడలూ ఇద్దరూ ఉద్యోగాలకు వెళ్ళిపోతారు. ఇద్దరు పిల్లలు స్కూలుకు పరుగెడతారు.

ఆదివారాలే విశ్రాంతి. పిల్లలను తీసుకుని కారులో ఏ షికారుకో షాపింగ్‌కో వెళ్తారు. వాళ్ళ మధ్య మనమెందుకులే అంటూ తను ఇంటివద్దే. వంట బిజీతో సావిత్రమ్మ. పిల్లలతో కాలక్షేపం సైతం తక్కువే. ఇవేం మాచర్ల చదువులా!

సిటీ చదువులాయె! రాత్రికి నిద్ర మొహంతో ఇంటికి చేరితే సూర్యోదయంతో పరుగులు మొదలు.

తను సావిత్రి! ఏం మాటలుంటాయి? ఏం ముచ్చట్లుంటాయి? అందుకే- ఆ అపార్ట్‌మెంట్ సీనియర్ పీపుల్ అసోసియేషన్‌లో మెంబరయ్యాడు.

అంతా కలిసి ఓ పదిపోను-ఇరవై మందిదాకా ఉన్నారు. అందరూ రిటైరనవారే. మరికొందరు తనకంటే పెద్ద వయసులో వారు.

ఈ అసోసియేషన్‌కు అధ్యక్ష కార్యదర్శులు. ఓ చిన్నసైజు జాబ్‌చార్ట్ కూడా.

పండుగలు, పబ్బాలు, ఉత్సవాలు అపార్ట్‌మెంట్‌లో నిర్వహించేలాగున సలహాలివ్వడం, నిర్వహింపచేయడం. గీతాపారాయణం, ఆధ్యాత్మిక ప్రసంగాలు కొనసాగించడం. వారానికో రోజున కలసి సాంస్కృతి కార్యక్రమాలకు వెళ్ళడం..గట్రా వంటివి.

ఈ నేపథ్యంలో..అసోసియేషన్ మెంబర్లతో సాన్నిహిత్యం బాగానే పెరిగింది.

దానితోపాటుగా వార్ధక్యంతో చోటు చేసుకునే బాధలూ, వేదనలూ తెలుస్తున్నాయి.

ఒక్కొక్కరిది ఒక్కొక్క రకమైన అనుభవం. మర్యాదలు లభించనివారు-చిన్నచూపు చూడబడేవారు. మందులకు మాకులకు కుటుంబ సభ్యులను నోరు తెరిచి అడిగినా, తిరస్కరింపబడేవారు- కుటుంబంలో తామొకరం పెద్దవారం ఉన్నామనే స్పృహ కూడా లేనివారు-

ప్రేమగా, గౌరవంగా చూడబడేవారు కొద్దిమందే. రకరకాల అనుభవాల వ్యథల వలయాల్లోని గాథల విశ్లేషణలు!

అయితే తనకు మాత్రం ఇంతవరకు గౌరవమర్యాదలకేం లోటులేదు.

కానీ ఎల్లకాలమూ ఇలా జరుగుబాటుంటుందా? అలాగని కుటుంబంలోని వారిని తప్పు పట్టకూడదు భిన్నంగా జరిగినా! సహజ ప్రవృత్తులు ఎవరికైనా ఒక్కటే.



తను కూరగాయలు మార్కెట్‌కు వెళ్ళి తెస్తానన్నా-సారధి వద్దంటాడు. కోడలు సుచిత్ర కూడా చిన్న పనిని సైతం చెప్పదు!

అంటే అలా క్రింద కాలు పెట్టకుండా వృద్ధాప్యం జరిగిపోతే అదేనా జీవితపరమార్థం! ఇంతకు మించి మరేం లేదా? జీవితమంటే ఇంతేనా?

ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు ఉమాసుతరావుకు. ప్రొద్దున్నే భుజం కుదిపి నిద్రలేపింది సావిత్రమ్మ ఏమిటీ కుర్చీలో నిద్రపోవడమంటూ.

ఆరోజున తనో నిర్ణయానికొచ్చిన వాడిలా ఉత్సాహంగా కన్పించాడు. పంపవల్సిన దరఖాస్తులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పోస్ట్ చేసాడు.

అవేమిటి? అని సావిత్రమ్మ అడగలేదు. తనూ చెప్పలేదు.

సారధికీ చెప్పలేదు.

సరిగ్గా ఓ నెలరోజుల తర్వాత మాచర్ల డిపోనుంచి కవరందుకున్నాడు. ముఖం సంతోషంతో వెలిగిపోయింది. సంవత్సరం తర్వాత క్రొత్తరక్తం ఉరుకులు పెట్టింది.

"ఏమిటా కవరు?" అంది సావిత్రమ్మ.

"ఏమిటేమిటి? ఏమిటంటావేమిటి? కాంట్రాక్ట్ బేసిస్ మీద మాచర్ల డిపోలోనే ట్రాఫిక్ యస్.ఓ.గా వేసారు. ఎంక్వైరీలోనైనా, డ్యూటీ సెక్షన్లో నైనా చెయ్యొచ్చు" క్రొత్తగా ఉద్యోగం వచ్చినంతగా సంబరపడ్డాడు ఉమాసుతరావు.

"మళ్ళీ ఉద్యోగమేమిటి? జీతం ఎంత?"

"జీతం పన్నెండొందలే! అయితే మాత్రం ఏం? ఓ వారంలో జాయిన్ కావాలి"

"చూడండీ! ఇంకా మీకెందుకా ఉద్యోగం-ముప్పై ఏళ్ళు చేసారు. కృష్ణా రామా అనుకోక! ఈ వయసులో ఎందుకు శ్రమ?" ఏదేదో అంటోంది సావిత్రమ్మ.

"కర్మాచరణ! బాధ్యతలు-కర్మలు నిర్వహించని శరీరం శవంతో సమానం" స్వామివారి అనుగ్రహభాషణం నాటి మాటలను అన్నాడు ఉమాసుతరావు నిశ్చలంగా.

ఏం అర్థంకాక అలానే చూస్తూండిపోయింది సావిత్రమ్మ.

కొడుకును, కోడలిని ఒప్పించి మాచర్లకు రావడం యజ్ఞమే అయ్యింది. మరలా తనింట్లో తాను! డ్యూటీలో తాను! తన జనం మధ్యన బిజీగా తను!

"నాకీ లంచ్‌బాక్స్‌ల సర్దుడు ఈ జన్మకు తప్పేటట్టు లేదు" అంటూ సావిత్రమ్మ ఎప్పుడైనా విసుగు కనబరిస్తే-

హాయిగా నవ్వేవాడు ఉమాసుతరావు. "పిచ్చిదానా! నాలో ఓపిక, శక్తి రెండూ ఉన్నాయి. ప్రొద్దున్నే వెళ్ళి సాయంత్రం వస్తూంటే ఇప్పుడెంత హాయిగా ఉందని! ఇప్పుడు మావాళ్ళు కూడా నన్నేమంటున్నారో తెల్సా!

రిటైరై కూడా సేవలందిస్తున్నావేయ్? నీలాంటి సీనియర్లు డిపోకు చాలా అవసరమోయ్ అంటూ మెచ్చుకుంటున్నారు. బెంగుళూరు ఫ్లాట్స్‌లో ఏముందోయ్! మాచర్ల బస్టాండ్‌లో డ్యూటీలో ఉండే ఆనందంలోనే జీవితం ఉందోయ్" అనేవాడు ఉమాసుతరావు.

"ఏంటో ఈయన ఉరుకులు పరుగులు ఈ వయసులో" అనుకునేది సావిత్రమ్మ. అనుకోవడమే కాదు మురిసిపోయేది కూడా చాటుగా.